క్లుప్తంగా

గంగువాడ పీహెచ్‌సీ తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ ప్రసాదరావు

పాతపట్నం: మండలంలోని గంగువాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం జిల్లా నోడల్ అధికారి, డిప్యూటీ డీఎంహెచ్ఓ ఎం.ప్రసాదరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు, రికార్డులు పరిశీలించారు. పీహెచ్‌సీలో అమలు అవుతున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరు మెడికల్ ఆఫీసర్ పూర్ణిమను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పీసీపీఎన్‌డీటీ యాక్ట్‌కు సంబంధించి విధివిధానాలను తప్పనిసరిగా పాటించాలని ఆస్పత్రి సిబ్బందికి సూచించారు. డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ వాన సురేష్ కుమార్ పాల్గొన్నారు.

భక్తిభావం పెరగాలి



ప్రవచనాలు చెబుతున్న బోదానంద

సారవకోట: ప్రజల్లో భక్తిభావం పెరగాలని యదార్థ బోదానంద అన్నారు. మండలంలోని కిన్నెరవాడ గ్రామంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో అర్చకులు కొరపాక సిద్ధయ్య స్వామి ఆధ్వర్యంలో మంగళవారం సత్సంగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఆచార, సంప్రదాయాలు విజ్ఞాన శాస్త్రంతో ముడిపడి ఉన్నాయన్నారు. మార్గశిర పౌర్ణమి గొప్పతనాన్ని, దత్తాత్రేయని చరిత్రను వివరించారు. రామకృష్ణ, ముద్దప రమణ, బోయిన వెంకటరమణ ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. సర్పంచ్ పంచిరెడ్డి పద్మావతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

పొందూరు: మండల కేంద్రానికి చెందిన సత్యసాయి భక్తుడు పెన్నం తరిణయ్యశెట్టి తన పుట్టిన రోజు సందర్భంగా నిరుపేదలకు దుప్పట్లు, అమృత కలశాలు 18 మందికి మంగళవారం అందించారు. ప్రతి ఏటా తన పుట్టిన రోజున ఇలా సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తరిణయ్యశెట్టి తెలిపారు.

మనోజ్ఞ మారుతీగా ఆంజనేయస్వామి



ఆంజనేయస్వామి విగ్రహం

నరసన్నపేట: స్థానిక పెద్దపేటలోని ఆంజనేయ ఆలయంలో స్వామిని మనోజ్ఞ మారుతీగా మంగళవారం అలకంరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు.

ఇంటింటికీ అయోధ్య రాముడి అక్షింతలు



సారవకోట: అక్షింతలకు ప్రత్యేక పూజలు చేస్తున్న నిర్వహణ కమిటీ సభ్యులు

సారవకోట: మండలంలోని ప్రతి ఇంటికీ అయోధ్య రాముడి అక్షింతలు పంపిణీ చేయనున్నట్లు నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు. మండల కేంద్రంలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు చౌదరి సురేష్, వాడ పున్నయ్య, వాన యర్రయ్య, దేసపాకల దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రాముని అక్షింతలు శోభాయాత్ర

పొందూరు: అయోధ్య నుంచి తెచ్చిన రామచంద్రుని దివ్య అక్షింతలు మంగళవారం సాయంత్రం స్థానిక పట్టణ వీధుల్లో ఊరేగించారు. ఆబాలగోపాలం ఈ శోభాయాత్రలో పాల్గొన్నారు. రామభజన వీధిలో రాముని సన్నిధి నుంచి యాత్రను పొందూరు పురవీధుల్లో కొనసాగించారు.



మెళియాపుట్టి: చాపరలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఆమదాలవలస: ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్



సరుబుజ్జిలి: రొట్టవలసలో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



ఆమదాలవలస రూరల్: వంజంగిలో క్రీడా పోటీలను తిలకిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు

గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను మరింత ప్రోత్సహించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం పేరిట క్రీడా పోటీలను మంగళవారం ప్రారంభించింది. ప్రజాప్రతినిధులు, అధికారులు క్రీడా పోటీలను ఆరంభించి, క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు, యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని, క్రీడలతో శారీరక ఆరోగ్యం, మానసిక ఉల్లాసం కలుగుతాయన్నారు. క్రీడల్లో రాణించిన ఎంతోమంది ఉజ్వల భవిష్యత్ పొందారని, వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

-సాక్షి నెట్‌వర్క్



సారవకోట: బుడితిలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



నరసన్నపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద షటిల్ పోటీలను ప్రారంభిస్తున్న అధికారులు



సరుబుజ్జిలి: బూర్జ మండలం ఓవీపేటలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు



హిరమండలం: ధనుపురంలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



కొత్తూరు: ఓంద్రుజోలలో క్రీడాకారులకు టోపీలు, క్రీడాదుస్తులు అందజేస్తున్న దృశ్యం

నరసన్నపేట అభివృద్ధికి పెద్దపీట

- ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్
- నరసన్నపేటలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం



రక్షిత నీటి ట్యాంకులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: నియోజకవర్గ కేంద్రం నరసన్నపేటను ఇప్పటికే అన్ని విధాలా అభివృద్ధి చేపట్టినట్లు ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ తెలిపారు. సత్యవరం కూడలిలో జల్ జీవన్ నిధులు రూ.5.13 కోట్లతో నిర్మించిన రెండు రక్షిత నీటి ట్యాంకులను, దీనికి అనుసంధానంగా జగన్నాథపురం, మారుతీనగర్‌ల్లో వేసిన ఇంటింటికీ కుళాయిలను మంగళవారం ప్రారంభించారు. రూ.30 లక్షలతో మారుతీనగర్ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. దుర్గా భవానీ కార్ స్టాండ్‌కు స్థలం కేటాయించి స్టాండ్ పనులను ప్రారంభించారు. సెంటర్ డివైడర్‌పై పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్యతో కలిసి మొక్కలు నాటారు. పీఏసీఎస్ వద్ద నూతనంగా నిర్మించిన రెండు షాపులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నాలుగేళ్లలో కోట్లాది రూపాయలు వెచ్చించి పలు రోడ్లు నిర్మించామన్నారు. జల్ జవన్ మిషన్ నిధులతో ఇంటింటికీ కుళాయిలు వేస్తున్నామన్నారు. నీటి ఎద్దడి ఉన్న వీధులకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. రాజుల చెరువు అభివృద్ధికి, ప్రధాన రహదారి అభివృద్ధితోపాటు పలు పనులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని, త్వరలోనే ఈ పనులు ప్రారంభిస్తామన్నారు. నరసన్నపేటలోని వంద పడకల ఆస్పత్రిని అభివృద్ధి చేశామని తెలిపారు. మురుగు నీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమాల్లో డీసీసీబీ అధ్యక్షుడు కరిమి రాజేశ్వరరావు, ఎంపీపీ ఆరంగి మురళి, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సుదర్శనరావు, ఏఈ ఉదయ్‌భాస్కర్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజాపు అప్పన్న, కేసీహెచ్‌బీ గుప్త, పాగోటి రాజారావు, ఎస్.కృష్ణబాబు, సురంగి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే హక్కుల సాధన

- విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు ధనుంజయరావు



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

జలుమూరు: ఐక్యతతోనే హక్కులను సాధించవచ్చని విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు సింహాద్రి ధనుంజయరావు ఆచారి అన్నారు. చల్లవానిపేట సమీపంలోని దత్తుబాబు మామిడి తోటలో మంగళవారం వన సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ధనుంజయరావు మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణులు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 30 లక్షల మంది ఉన్నారన్నారు. ధనికులు, ఉన్నత ఉద్యోగులు, మేధావులందరూ కలిసి.. మనలో ఉన్న పేదవారికి అవసరమైన సహాయం అందించేందుకు ముందుకు రావాలన్నారు. అనంతరం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వమరవల్లి వీరాస్వామి ఆచారి, ఉపాధ్యక్షుడిగా సింహాద్రి అప్పలరాజు, ప్రధాన కార్యదర్శిగా సింహాద్రి రామకృష్ణ, సహాయక కార్యదర్శిగా జి మధు, కోశాధికారిగా డి.చంద్రరావును ఎన్నుకున్నారు. చల్లవానిపేట, లింగాలువలస సర్పంచ్‌లు పి.రామచంద్రరావు, డి.స్వామిబాబు, ఎంపీటీసీలు పి.భారతి, బి.తేజోమణి, వ్యవసాయ మండలి చైర్మన్ బుక్కా లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

పెద్దమల్లిపురంలో రీ సర్వే

పాతపట్నం: భూ సర్వేను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కె.రవిచంద్ర అన్నారు. మండలంలోని పెద్దమల్లిపురం గ్రామంలో మంగళవారం రైతులతో కలిసి భూ రీసర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ యాజమానులు రీ సర్వేలో తమకున్న రికార్డులు, డాక్యుమెంట్‌లు, పాస్‌బుక్‌లు తీసుకు రావాలన్నారు. వీఆర్వో సునిల్, సర్పంచ్ సత్యవతి, ఏనుగుతల సూర్యం, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంటీ సూర్యనారాయణ

కొత్తూరు: మండంలోని లబ్బ గ్రామంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అధికారులు మంగళవారం అవగాహన కల్పించారు. వికసిత్ హమారా సంకల్ప యాత్రలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకులు టి.తులసి ప్రారంభించారు. ప్రజల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు రకాల పథకాల ప్రయోజనాలను ఈఓపీఆర్డీ కృష్ణారావు, ప్రజలకు వైద్య పరంగా అందిస్తున్న పథకాలను మెట్టూరు పీహెచ్‌సీ వైద్యాధికారి రాంబాబు వివరించారు. ప్రధానంగా టీబీ నివారణకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలను తెలియజేశారు. రైతులకు పీఎం కిసాన్ వంటి పథకాలను వివరించారు. ప్రకృతి వ్యవసాయ సాగు విధానంపై ఎంటీ సూర్యనారాయణ అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం కోసం ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని వివరించారు.

ప్రకృతి వ్యవసాయాన్ని సాగు చేస్తామని రైతులతో ప్రతిజ్ఞ చేయించారు. బీజేపీ మండల కన్వీనర్ వి.ప్రసాద్, కార్యదర్శి సీహెచ్ నర్సింహమూర్తి, ఈఓ ఎ.కృష్ణారావు, ఆశ వర్కర్లు, రైతులు పాల్గొన్నారు

నాగమణికి సత్కారం



నాగమణిని సత్కరిస్తున్న దృశ్యం

ఎల్.ఎన్.పేట: ప్రతీ విద్యార్థి చదువుకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్సైగా ఎంపికైన మండలంలోని పెద్దకోట గ్రామానికి చెందిన బమ్మిడి నాగమణి అన్నారు. తురకపేట సెంటర్‌లోని ఠాగూర్ ఎడ్యుకేషనల్ అండ్ సర్వీస్ సొసైటీ (టెస్) అధ్యక్షుడు పెద్దకోట వెంకటరావు అధ్యక్షతన మంగళవారం నాగమణిని సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. ఎంతో పేదరికం నుంచి వచ్చిన తాను చదువుకుని ఎస్సై కొలువును సాధించానన్నారు. మోపెడ్ వాహనంపై కూరగాయలు అమ్ముకునే మా నాన్నకు ఎంతో గౌరవాన్ని తీసుకువచ్చానన్నారు. టెస్ కార్యదర్శి డి.సుజాత, సభ్యులు ఎ.శేఖర్, సంతోష్‌కుమార్, తమ్మినాయుడు, ఆర్.వాణిశ్రీ, తవుడు, రమణమ్మ, బమ్మిడి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు జూదరుల అరెస్ట్

ఆమదాలవలస రూరల్: మండలంలో కొత్తవలస గ్రామం సమీపంలో చెరువు గట్టుపై పేకాడుతున్న ముగ్గురు జూదరులను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ వై.కృష్ణ మంగళవారం తెలిపారు. కొత్తవలస గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు జూదం ఆడుతుండగా ఎస్‌ఈబీ అధికారులు దాడులు చేసి వారి వద్ద నుంచి రూ. 2200 నగదును స్వాధీనం చేసుకున్నారన్నారు. ఆ మొత్తాన్ని పోలీస్ స్టేషన్‌కు అప్పగించారన్నారు.

ఘనంగా కృష్ణచైతన్య పుట్టినరోజు వేడుకలు



జలుమూరు: ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌కు కేక్ తినిపిస్తున్న కృష్ణచైతన్య



నరసన్నపేట: కోమర్తి వద్ద ద్విచక్ర వాహన ర్యాలీ



పోలాకి: కేక్ కట్ చేస్తున్న ధర్మాన కృష్ణచైతన్య

జలుమూరు: బుడితి జంక్షన్ సమీపంలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఆధ్వర్యంలో పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు, బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జి ధర్మాన కృష్ణచైతన్య పుట్టినరోజు వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణ దాస్ అన్నారు. నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ హాజరయ్యారు. 14 ఏళ్ల సీఎంగా పనిచేసిన చంద్రబాబు పేద ప్రజలకు చేసింది శూన్యమన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చొరవ, పరిపాలన దక్షతతో ఇచ్చిన హామీలు 98 శాతం అమలు చేశారన్నారు. మరోసారి అధికారంలోకి వచ్చేందుకు అన్ని వర్గాల ప్రజలు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రతి పక్షాలు ఎన్ని దుష్ప్రచారాలు చేసినా గెలుపు తమదేనని ధర్మాన కృష్ణచైతన్య అన్నారు. ఈ కార్యక్రమంలో సీఈసీ మెంబర్ ధర్మాన పద్మప్రియ, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ధర్మాన రామదాస్, ఎంపీపీలు వాన గోపి, ఆరంగి మురళీ, అల్లాడ, చల్లవానిపేట, సారవకోట పీఏసీఎస్ అధ్యక్షులు శ్యామరావు, రాజప్పల నాయుడు, గెల్లంకి వెంకటరావు, జిల్లా లైవ్ స్టాక్ చైర్మన్ నక్క తులసీదాస్, జిల్లా ప్రచార కార్యదర్శి నిక్కు రాజశేఖర్, వైస్ ఎంపీపీలు తంగి మురళీకృష్ణ, డోల నాగరత్నం, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మబగాంలో..

పోలాకి: పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణ చైతన్య పుట్టినరోజు వేడుకలు మంగళవారం ఆయన స్వగ్రామం మబగాంలో ఘనంగా నిర్వహించారు. అభిమానులు, పార్టీ కార్యకర్తలు, కుటుంబ సభ్యుల సమక్షంలో కృష్ణచైతన్య కేక్ కట్ చేశారు. అనంతరం అక్కడ నుంచి పార్టీ శ్రేణులతో కలిసి బైక్ ర్యాలీగా మాకివలస మీదుగా కోమర్తి, ఉర్లాం, అల్లాడ, కొమనాపల్లి నుంచి జలుమూరు మండలం బుడితి జంక్షన్‌కు చేరుకున్నారు.

నరసన్నపేటలో..

నరసన్నపేట: పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణ చైతన్య పుట్టినరోడు వేడుకలు నరసన్నపేటలో మంగళవారం నిర్వహించారు. ద్విచక్ర వాహన ర్యాలీతో వచ్చిన కృష్ణచైతన్యకు మండలంలోని మాకివలస, దేవాది, కోమర్తి, యారబాబు, ఉర్లాం, నడగాం, ముద్దాడపేట, చోడవరం గ్రామాల వద్ద పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. సాయంత్రం నరసన్నపేట టౌన్‌లో పలు చోట్లు కేక్‌లు కట్ చేశారు.

భక్తిశ్రద్ధలతో శోభాయాత్ర



ఘటాలతో శోభాయాత్ర నిర్వహిస్తున్న మహిళలు, భక్తులు

సారవకోట: మండలంలోని అవలింగి గ్రామంలోని నీలమణి అమ్మవారి శోభాయాత్రను మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ మూర్తులను పల్లకిలో ఊరేగించారు. మహిళలు ఘటాలతో ఆలయానికి చేరుకుని అమ్మవారి మూల విరాట్‌ను అభిషేకం నిర్వహించారు.

మెప్మా బజార్లతో ఆర్థిక స్వావలంబన



మెప్మా బజార్‌లో వస్తువులను పరిశీలిస్తున్న పీడీ కిరణ్‌కుమార్

ఆమదాలవలస రూరల్: పట్టణ స్వయం సహాయక సంఘాల మహిళల్లో సుస్థిర ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం మెప్మా బజార్లను ప్రోత్సహిస్తోందని మెప్మా పీడీ ఎం.కిరణ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని లక్ష్మీనగర్ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో మంగళవారం మెప్మా బజారును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రోత్సాహంతో మహిళా స్వయం సహాయక సంఘాలకు బ్యాంకులు పెద్ద ఎత్తున రుణాలు మంజూరు చేస్తున్నాయని, వీటిని ఆదాయాభివృద్ధికి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ఆర్థిక లబ్ధి దాదాపుగా మహిళలకే అందుతుందని, వాటిని ఆదాయాభివృద్ధి కార్యక్రమాలకే వినియోగించి సుస్థిర ఆర్థిక స్వావలంబన సాధించాలన్నారు. జిల్లాలో ప్రతీ పట్టణంలో ఎంపిక చేసిన లబ్ధిదారులతో పట్టణ ప్రగతి యూనిట్ల ఏర్పాటు, మెప్మా మార్టుల ఏర్పాటుతో మహిళా స్వయం సమృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్ ఆసరా (రుణ మాఫీ) నాల్గో విడత నిధుల విడుదల కోసం లబ్ధిదారుల బయోమెట్రిక్ నమోదు జరుగుతున్నందున అర్హులందరూ నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మెప్మా సిబ్బంది రాజేష్, నాగమణి, మెట్ట అమ్మినాయుడు, ఆర్పీలు, మహిళలు పాల్గొన్నారు.

భక్తితోనే ముక్తికి మార్గం



ప్రవచనాలు చెబుతున్న యాలాల శ్రీనివాసరావు

కొత్తూరు: దైవ భక్తితోనే ముక్తి లభిస్తుందని ప్రముఖ ప్రవచనకర్త యాలాల శ్రీనివాసరావు అన్నారు. కొత్తూరులో హరేరామ నగర సంకీర్తన 43వ వార్షికోత్సవంలో భాగంగా స్థానిక సీతారామాలయంలో ఐదు రోజులపాటు పురాణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంగళవారం రాత్రి సందరాకాండ విశిష్టతను శ్రీనివాసరావు వివరించారు. దైవ భక్తి ఉన్నవారికి భగవంతుడు కష్టాల నుంచి విముక్తి కల్పిస్తారన్నారు. దైవభక్తి కలిగి ఉంటే మంచి ఆలోచనలు రావడంతోపాటు మనశ్శాంతి కలుగుతుందన్నారు. దైవ భక్తి ఉన్నవారిలో మంచి భావాలతోపాటు ఆధ్యాత్మిక చింతన ఉంటుందన్నారు. హరేరామ నగర సంకీర్తన బృందం సభ్యులు పాల్గొన్నారు.